

జోరు తగ్గని కృష్ణమ్మ

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతుంది.

వివరాలు 10లో ▸



..జన సందడి

శ్రీశైలం డ్యాం గేట్లు రెండేళ్ల తర్వాత ఎత్తడంతో పర్యాటకులు తరలివచ్చారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.0 /23.6

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం, చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రెండో విడత రుణమాఫీపై సమీక్ష

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రుణమాఫీలో భాగంగా రెండో విడతను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ విజయేందిర తెలిపారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావుతో కలిసి వ్యవసాయాధికారులు, జిల్లా సహకార అధికారి, ఎల్‌డీఎం, ఇతర అధికారులతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. మండలంలో వీసీ యూనిట్ ఉన్న రైతువేదికల్లో రెండో విడత రుణమాఫీ కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్షించి సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రూ.1.50 లక్షలలోపు బ్యాంకు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ అవుతుందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్రంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. అదే సమయంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో, మండలాల్లో మధ్యాహ్నం 12 గంటలకు రెండో విడత రుణమాఫీ ప్రారంభిస్తారని, కార్యక్రమానికి బ్యాంకర్లు, ఎంపిక చేసిన రైతులు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు హాజరుకానున్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి ప్రతి మండలం నుంచి ఎంపిక చేసిన రైతులను తీసుకువచ్చేలా వ్యవసాయ అధికారులు రవాణా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే మండలంలో వీసీ ద్వారా రెండో విడత రైతు రుణమాఫీ కార్యక్రమం ఏర్పాట్లు చేయాలని, బ్యాంకర్లకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్, జిల్లా సహకార అధికారి పద్మ, ఎల్‌డీఎం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌లో లావాదేవీలు


దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం లావాదేవీలు ప్రారంభం కానున్నాయి. మార్కెట్‌కు రైతులు తమ ధాన్యం అమ్మకానికి తేవచ్చని, వ్యాపారులు టెండర్ల ద్వారా ధరలు నిర్ణయిస్తారని అధికారులు తెలిపారు. ఆదివారం, సోమవారం బోనాల పండుగ సెలువు ఇచ్చారు. దీంతో రెండు రోజులుగా ఎలాంటి లావాదేవీలు జరగలేదు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయ జావెలిన్‌డేను పురస్కరించుకొని సోమవారం జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. అండర్-14, 16, 18, 20 బాల, బాలికలతోపాటు పురుషులు, మహిళలకు 100 మీ., 400 మీ., పరుగు, జావెలిన్ అంశాల్లో ఎంపికలు చేపట్టారు. ఎంపికలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రారంభించి మాట్లాడారు. ఎంపికైన జిల్లా అథ్లెట్లు వచ్చేనెల 7న జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు సాధిక్ అలీ, రమేష్‌బాబు, డీఎస్‌ఏ కోచ్ సునీల్ కుమార్, సభ్యులు పి.శ్రీనివాస్, సి.శ్రీనివాస్, పీడీలు వడెన్న, శ్రీనివాస్, జగదీష్, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యల పరిష్కారానికి కృషి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి 'నిధి ఆప్కే నికాత్ 2.0' చక్కటి వేదిక అని మహబూబ్‌నగర్ పీఎఫ్ నోడల్ అధికారి (ఈఓ) రాంమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రం పారిశ్రామికవాడలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఎఫ్ ఖాతాదారుల సమస్యలు నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పది మందికిపైగా పనిచేస్తున్న వ్యాపార- వాణిజ్య, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలలో ఉద్యోగుల భవిష్యత్తు పీఎఫ్ సభ్యత్వం తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా ఖాతాదారుల ఆన్‌లైన్ క్లెయిమ్ చేయడం, సభ్యుల హెల్ప్ డెస్క్, ఆయా ఫిర్యాదుల నమోదుతోపాటు పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు, సభ్యులు భగవంతు, జీఎస్ రెడ్డి, శివకుమార్, పీఎఫ్ సీనియర్ సెక్యూరిటీ అసిస్టెంట్లు శివకుమార్, దీపస్‌చక్రవర్తి, జిల్లా ఈఎస్ఐసీ బ్రాంచి మేనేజర్ అరబ్‌అనీస్, అసిస్టెంట్ అజిత్ తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షణకు తెర..

సబ్సిడీ చేపపిల్లల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం

- టెండర్ల నిర్వహణపై అధికారుల దృష్టి
- క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాతే విడుదలకు చర్యలు
- ఈ ఏడాది 1.90 కోట్ల విత్తనాల పంపిణీ లక్ష్యం
- నాణ్యమైనవి ఇవ్వాలని మత్స్యకారుల వేడుకోలు

జిల్లాలో నోటిఫైడ్ చెరువులు, కుంటలు	చేప విత్తనాల పంపిణీ లక్ష్యం	
1,086	1.90 కోట్లు	
మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు	మత్స్యకారులు	మహిళా మత్స్యకారులు
201	11,411	779
మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు	20	



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై అందించే చేపపిల్లల పంపిణీ విషయంలో నిరీక్షణకు తెరపడింది. గత ప్రభుత్వం మత్స్యకారులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉచిత చేపపిల్లల పంపిణీని చేపట్టింది. అయితే ప్రభుత్వం మారాక ఈ పథకం కొనసాగుతుందా.. లేదా.. అనేదానిపై సందిగ్ధం నెలకొంది. తాజాగా మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వంద శాతం సబ్సిడీపై చేప విత్తనాలను పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లాలో ఉన్న నీటి వనరులకు సరిపడా చేపవిత్తనాల లక్ష్యాన్ని నిర్ణయించి టెండర్లు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో జిల్లా మత్స్యశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే టెండర్లు స్వీకరించే కార్యక్రమం ప్రారంభం కాగా.. త్వరలో టెక్నికల్ బిడ్ పూర్తి చేసి క్షేత్రస్థాయిలో హెచరీస్‌ను పరిశీలించి ఫైనల్ చేయనున్నారు. మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న సబ్సిడీపై చేపపిల్లల పంపిణీ కార్యక్రమం ద్వారా జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లోని మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

నీటి నిల్వ ఆధారంగా..

జిల్లాలో మత్స్యశాఖ అధికారులు చెరువుల్లో నీటి నిల్వ ఆధారంగా చిన్న పరిమాణం 35 మిల్లీ మీటర్ల నుంచి 100 మిల్లీ మీటర్ల వరకు చేప విత్తనాలను వదలనున్నారు. కట్ల, రాహు, మ్రిగాల రకం చేప విత్తనాలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం జిల్లాలోని ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటలను గుర్తించారు. టెండర్లు నిర్వహించిన వెంటనే పంపిణీ ప్రక్రియను చేపట్టనున్నారు. ఎంపికైన టెండర్‌దారుల హెచరీలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం చేప విత్తనాలను చెరువులు, కుంటల్లో వదిలే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.



హన్వాడ మండలం సల్లోనిపల్లి రాంచెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు (ఫైల్)

నాణ్యమైనవి ఇవ్వాలి..



ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై ఇస్తున్న చేప విత్తనాలను నాణ్యతతో కూడినవి ఇవ్వాలి. నిర్ణీత సైజులో చేప విత్తనాలు ఉండేలా మత్స్య శాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. తక్కువ సైజులో ఉన్న చేప విత్తనాలు చెరువుల్లో వదలడం ద్వారా వాటి పెరుగుదల ఆశించిన స్థాయిలో ఉండదు. నిర్ణీత సైజులో చేపవిత్తనాలు పంపిణీ చేసి మత్స్యకారుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి.

– లక్ష్మయ్య, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, అమ్మాపూర్

టెండర్లు ఫైనల్ కాగానే..



చెరువులు, కుంటల్లో వంద శాతం సబ్సిడీపై చేపవిత్తనాల పంపిణీకి సంబంధించి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలోని చెరువులు, కుంటల్లో మొత్తం 1.9 కోట్ల చేప విత్తనాల పంపిణీ లక్ష్యంగా నిర్దేశించాం. బిడ్డర్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో హెచరీలను పరిశీలించిన అనంతరం టెండర్లను ఫైనల్ చేసి చేప విత్తనాలు పంపిణీ చేస్తాం.

– చరితారెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి

పెట్రోలింగ్ నిరంతరం కొనసాగాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్పీ జానకి, పక్కన ఏఎస్పీ రాములు తదితరులు

- డయల్ '100' కాల్స్‌కు తక్షణమే స్పందించాలి : ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న బ్లూ కోర్ట్స్, పెట్రో కార్లు డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవాలని ఎస్పీ జానకి అన్నారు. జిల్లా పరేడ్ మైదానంలో సోమవారం బ్లూకోర్ట్స్, పెట్రో కార్లను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ని వాహనాలు ఉన్నాయి.. ఎక్కడ ఎన్ని బీట్స్ నడుస్తున్నాయి.. అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి స్టేషన్ పరిధిలో ఒక ప్రణాళికతో పెట్రోలింగ్ నిర్వహిస్తూ చోరీలు జరగకుండా చూడాలన్నారు. డయల్ 100కు కాల్ వచ్చిన వెంటనే స్పందించి సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని సూచించారు. బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ కార్లు నిరంతరం గస్తీలు నిర్వహిస్తూ కాలనీల్లో ప్రజల్లో ధైర్యం కల్పించడం, చోరీలు, ఇతర నేరాలు కట్టడికి కృషిచేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఫిర్యాదుల పట్ల జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం వల్లే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని గుర్తుచేశారు. మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల అధిక ప్రమాదాలు చోటుచేసుకుంటున్న క్రమంలో ట్రాఫిక్, పట్టణ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు పెంచాలన్నారు. పోలీస్ సిబ్బంది ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో తప్పక హెల్మెట్ ధరించాలని, ఎవరైనా సిబ్బంది పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువస్తే రివార్డులు ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, ఆర్ఐ నగేష్, ఐటీ కోర్, ఎంటీ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు ప్రభుత్వం ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచిన స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకు దాదాపు 6 సంవత్సరాలుగా సుమారు రూ.8 వేల కోట్లు స్కాలర్‌షిప్ పెండింగ్ ఉందని, విద్యార్థులకు ఇవ్వాల్సి ఉన్నా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. దీంతో విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాకే సుమారు రూ.11వందల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన పాలమూరు జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. స్కాలర్‌షిప్‌లను విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. వీలైనంత త్వరగా స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రశాంత్, నందు, ఈశ్వర్, రాధిక, సాయి, మధు తదితరులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి' పథకంతో పెరిగిన ఆక్యుపెన్సీ



మాట్లాడుతున్న ఆర్ఎం వి.శ్రీదేవి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రీజియన్‌లోని పది డిపోల పరిధిలో ప్రతిరోజూ 3.25 లక్షల కి.మీ., మేర ఆర్టీసీ బస్సులు తిప్పుతున్నామని ఆర్ఎం వి.శ్రీదేవి చెప్పారు. సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో విలేకరులతో ఆమె మాట్లాడారు. నిత్యం పల్లెవెలుగు బస్సులు 482, ఎక్స్‌ప్రెస్ 283, సూపర్ లగ్జరీ 43, డీలక్స్ 34 ఇలా మొత్తం 842 నడుస్తున్నాయన్నారు. గత డిసెంబర్ 9కి ముందు 2.60 లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో రాకపోకలు సాగించేవారని, మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత 4.40 లక్షల మందికి పెరిగారన్నారు. ఇందులో జీరో టికెట్‌కు సంబంధించి 2.80 లక్షల మంది (55 శాతం), టిక్కెట్ చెల్లించే వారు 1.60 లక్షల మంది (45 శాతం) ఉన్నారన్నారు. ఇందులో 93 శాతం పల్లెవెలుగు బస్సుల్లోనే వెళ్తున్నారని, 7 శాతం మంది సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు వివరించారు. మహబూబ్‌నగర్- హైదరాబాద్ మార్గంలో పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా కొన్ని బస్సులను జడ్చర్ల ఫ్లైఓవర్ వద్ద సింగిల్ స్టాప్‌గా ఆపుతున్నామన్నారు. 15రోజులకోసారి మహిళా ప్రయాణికుల కోసం లక్కీ కూపన్ తీస్తున్నామన్నారు.

125 కొత్త షాపులు..



సంస్థకు ఆదాయ వనరులను పెంచడంలో భాగంగా ఉమ్మడి జిల్లా పది డిపోల పరిధిలోని ఖాళీ ప్రదేశాల్లో 125 కొత్త షాపు (కమర్షియల్ కాంప్లెక్స్)లు నిర్మిస్తున్నామని, ఇందులో మహబూబ్‌నగర్‌లోనే 20 ఉన్నాయని ఆర్ఎం తెలిపారు. వీటికి టెండర్ పిలిచి వ్యాపారులకు అద్దెకు ఇస్తామన్నారు. తమ సర్వీసులో ఎలాంటి ప్రమాదాలు లేకుండా బస్సులు నడుపుతున్న డ్రైవర్లు ముగ్గురిని సత్కరించనున్నామన్నారు. అలాగే 367 అద్దె బస్సు (ప్రైవేట్ ఆపరేటర్లు)ల డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

శుభకార్యాలకు అద్దె బస్సులు

వచ్చే నెల 5వ తేదీ నుంచి శ్రావణమాసం ఆరంభమవుతున్నందున పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తామని ఆర్ఎం చెప్పారు. ప్రైవేట్ వాహనాల కన్నా తక్కువే చార్జ్ చేస్తామన్నారు. ఎలాంటి డిపాజిట్ గాని, డ్రైవర్‌కు బత్తా గాని చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ బస్సులు బుక్ చేసుకునేందుకు డిపోల వారీగా కింది ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. మహబూబ్‌నగర్- 94411 62588, అచ్చంపేట- 99592 26291, గద్వాల- 99592 26290, కల్వకుర్తి- 99123 76847, కొల్లాపూర్- 90004 05878, నాగర్‌కర్నూల్- 83092 14790, నారాయణపేట- 99592 26293, షాద్‌నగర్- 91826 45281, వనపర్తి- 99592 26289లను సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాకేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఎదిర రెవెన్యూ వార్డులో నిర్వహించిన వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

– స్టేషన్ మహబూబ్‌నగర్

- వివరాలు 11లో

ట్రేడ్ లైసెన్స్‌కు ని'బంధనాలు'!

మున్సిపాలిటీలో రూ.లక్షల్లో పేరుకుపోయిన రుసుం

- కొందరు రుణం కోసమే నమోదు చేసుకుంటున్న వైనం
- ముందుగానే రెన్యూవల్.. ఆఫై ఫీజు చెల్లించాల్సిందే
- వ్యాపార వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే పూర్తి చేయాలి
- సరళీకృత విధానంతో ఆశించిన ప్రయోజనాలు దక్కలే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలో ఏ వ్యాపారం నిర్వహించాలన్నా నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. వివిధ వ్యాపార, వాణిజ్య, ప్రైవేట్ విద్యాసంస్థలు కొనసాగించాలంటే ఏటా రెన్యూవల్ చేసి రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ అంతా ఎవరికి వారు (సంస్థ యజమానులు) సమీపంలోని మీ-సేవలో తమ పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే సౌకర్యం ఉంది. ఈ పద్ధతి (సరళీకృత విధానం)ని 2017లోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇది అమలులోకి వచ్చిన తర్వాత ఏ యజమాని కూడా మున్సిపాలిటీకి నేరుగా వెళ్లి ట్రేడ్ లైసెన్స్ తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. చాలావరకు ఏదో ఒక దుకాణం ప్రారంభించి ఆ వెంటనే బ్యాంకు రుణం కోసమే ఈ లైసెన్స్ పొందుతున్నారు. ఏటా రెన్యూవల్‌కు మాత్రం ముందుకు రావడం లేదు. తనిఖీల సమయంలో మున్సిపల్ అధికారులకు కొందరు యజమానుల నుంచి సరైన సహకారం లభించడం లేదు.



వన్‌టౌన్ సమీపంలోని ఓ మార్ట్‌లో ట్రేడ్‌లైసెన్స్‌ను తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురులింగం

నాలుగేళ్లలో ఆదాయం ఇలా..

వాస్తవానికి మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో కనీసం 15 వేలకు పైగా వివిధ వ్యాపార, వాణిజ్య దుకాణాలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆస్పత్రులు తదితరాలు ఉన్నాయి. అయితే ఇప్పటివరకు ఐదు వేలలోపే ఇవి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు కావడం గమనార్హం. ఇక 2021-22 ఆర్థిక సంవత్సరంలో 2,652 సంస్థల నుంచి రూ.22.94 లక్షలు రావాల్సి ఉండగా, రెన్యూవల్ కింద రూ.17.08 లక్షలు, జరిమానా రూ.69 వేలు కలిపి రూ.40.72 లక్షలు వసూలు చేయాలి. అయితే ఆ ఏడాది 38 సంస్థల నుంచి రూ.5.89లక్షలు, రెన్యూవల్ కింద రూ.60 వేలు కలిపి రూ.6.49 లక్షలు మాత్రమే వసూలైంది. 2022-23లో 3,430 సంస్థల నుంచి రూ.51.18 లక్షలు రావాల్సి ఉండగా, రెన్యూవల్ కింద రూ.33.33 లక్షలు, జరిమానా రూ.8.15 లక్షలతో పాటు పాత బకాయిలకు సంబంధించి జరిమానా రూ.14.81 లక్షలు కలిపి రూ.1,07,47,000 వసూలు కావాలి. అయితే 1,115 సంస్థల నుంచి రూ.32.39 లక్షలు, రెన్యూవల్ కింద రూ.2.46 లక్షలు, జరిమానా రూ.37వేలతో పాటు పాత బకాయిలకు సంబంధించి జరిమానా రూ.15 వేలు కలిపి రూ.35.37 లక్షలే వచ్చింది. 2023-24లో 4,016 సంస్థల నుంచి రూ.67.37 లక్షలు, రెన్యూవల్ కింద రూ.48.86 లక్షలు, జరిమానా రూ.19.70 లక్షలతో పాటు పాత బకాయిలకు సంబంధించి జరిమానా రూ.20.21 లక్షలు కలిపి రూ.1,56,14,000 రావాలి. అయితే 858 సంస్థల నుంచి రూ.33.96 లక్షలు, రెన్యూవల్ కింద రూ.86 వేలు, జరిమానా రూ.2.59 లక్షలతో పాటు పాత బకాయిలకు సంబంధించి జరిమానా రూ.36 వేలు కలిపి రూ.37.77 లక్షలు వచ్చింది. 2024-25కు గాను ఇప్పటివరకు 4,195 సంస్థల నుంచి రూ.70.73 లక్షలు, రెన్యూవల్ కింద రూ.81.93 లక్షలు, జరిమానా రూ.12.42 లక్షలతో పాటు పాత బకాయిలకు సంబంధించి జరిమానా రూ.40.88 లక్షలు కలిపి రూ.2,05,96,000 రావాలి. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 536 సంస్థల నుంచి రూ.26.81 లక్షలు, రెన్యూవల్ కింద రూ.3.22 లక్షలు, జరిమానా రూ.1.39 లక్షలతో పాటు పాత బకాయిలకు సంబంధించి జరిమానా రూ.1.61 లక్షలు కలిపి మొత్తం రూ.33.03 లక్షలు మాత్రమే వసూలైంది.

ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం

పట్టణ పరిధిలోని వివిధ వ్యాపార, వాణిజ్య సముదాయాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. ముఖ్యంగా ట్రేడ్ లైసెన్స్ కలిగిన వారు ఏటా నిబంధనల ప్రకారం ముందుగానే రెన్యూవల్ చేసుకోవాలి. దీనికి సంబంధించిన రుసుమును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. కొత్త వారు తమ వ్యాపారం వివరాలు వెబ్‌సైట్‌లో డోర్ నంబరుతో పాటు నమోదు చేసుకోవాలి. గడువులోగా రెన్యూవల్ చేసుకోకపోతే జరిమానా పడుతుంది.

– డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

ఆన్‌లైన్ ఏజెన్సీ మారినా..

రాష్ట్రవ్యాప్తంగా 2017లో ట్రేడ్‌లైసెన్స్ విధానంపై ఆన్‌లైన్ నిర్వహణ బాధ్యతలు ఈ-మాస్‌కు అప్పగించారు. ఈ సంస్థ 2021 నవంబర్ వరకు కొనసాగింది. ఆ తర్వాత సీజీజీకి అప్పగించినా మొదటి సంస్థ నుంచి పట్టణ పరిధిలోని ఆయా దుకాణాల పూర్తి వివరా (డేటా లాస్)లను ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. అసలు ఎన్ని దుకాణాలు ఉన్నాయి? ఎన్ని రెన్యూవల్ చేసుకోవాలి? తదితర వివరాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు 2020 కరోనా సమయంలో వ్యాపారం నడవక కొందరు దుకాణాలను శాశ్వతంగా మూసేశారు. అలాగే జడ్చర్ల-రాయచూరు (ఎన్‌హెచ్-167) ప్రధాన రహదారికి ఇరువైపులా కొన్ని షాపులు విస్తరణలో తొలగించారు. మరి కొందరు వ్యాపారంలో నష్టం వచ్చిందంటూ బంద్ చేశారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఇవన్నీ బయట పడుతుండగా ఆన్‌లైన్‌లో డిలీట్ చేయడానికి మున్సిపల్ అధికారులకు అవకాశం లేక తలలు పట్టుకుంటున్నారు. సదరు వ్యాపారి స్వయంగా దరఖాస్తు చేసుకోవాలనే కఠిన నిబంధనలతో ఏమీ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక ఆర్థిక సంవత్సరం ముగుస్తుండగా ఒక నెల ముందే రెన్యూవల్ చేసుకోవాలనే నిబంధనలను చాలా వరకు వ్యాపారులు పట్టించుకోవడం లేదు. ఆస్తి పన్ను మాదిరిగా తమకు రిబేట్ ఇవ్వాలని కోరుతున్నారు. 11 నెలల ముందే ఫీజు ఎలా చెల్లిస్తామని వారు వాదిస్తున్నారు.



శ్రీశైలం డ్యాం వద్ద కృష్ణమ్మ పరవళ్లను తిలకిస్తున్న పర్యాటకులు



శ్రీశైలం డ్యాం ఘాట్‌రోడ్డుపై ట్రాఫిక్‌జాం



ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తున్న పోలీసు

జల సవ్వడి.. జన సందడి

శ్రీశైలం డ్యాం గేట్లు రెండేళ్ల తర్వాత సోమవారం ఎత్తడంతో పర్యాటకులు పోటెత్తారు. శ్రీశైలం దైవదర్శనార్థం వెళ్లి వచ్చే వారితోపాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా డ్యాం వద్దకు చేరుకొని కృష్ణమ్మ అందాలను తిలకించారు. పాల నురగలా దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణా జలాలను చూసి పరవశించిపోయారు. యువతీ, యువకులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. ఈ క్రమంలో ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. డ్యాం వద్ద కార్లు ఇతర వాహనాలు ఆపడంతో భారీగా నిలిచిపోయాయి. దీంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న అమ్రాబాద్ సీఐ శంకర్‌నాయక్, ఈగలపెంట ఎస్‌ఐ వీరమల్లు పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

\- దోమలపెంట

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గట్టు: మండలంలోని ఆలూరు చెందిన ఆనంద్ (27) కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందగా సోమవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు. పెద్ద రంగన్న కుమారుడు ఆనంద్ ఈ నెల 27 రాత్రి క్రిమీసంహారక మందు తాగి వాంతులు చేసుకుంటున్న తరుణంలో వాకిటోని బాయి నర్సింహులు గమనించాడు. రవితో పాటుగా తండ్రి పెద్ద రంగన్నకు సమాచారం అందించారు. వెంటనే గద్వాల ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందగా మృతుని తల్లి కుమ్మరి శరణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మరో మహిళ

వడ్డేపల్లి మండలం కనకాలకు చెందిన వడ్డే పద్మమ్మ(59) కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా సోమవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. వడ్డే పద్మమ్మకు ముగ్గురు కుమారులు. వారు ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న క్రమంలో ఒంటరిగా ఉన్న ఈమె ఇటీవలే గట్టు మండలంలోని చాగదోణ చెందిన మేన కోడలు లక్ష్మి వద్దకు వచ్చింది. ఈ నెల 26న ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమీ సంహారక మందు తాగింది వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కల్తీ కల్లు కేసులో ఒకరి అరెస్టు

మల్దకల్: మండల కేంద్రంలో కల్తీ కల్లు విక్రయ కేంద్రాలపై ఆరు రోజుల క్రితం నార్కోటిక్, ఎక్సైజ్, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి, ముగ్గురిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. అదే రోజు కల్లు విక్రయిస్తున్న ధర్మేష్‌గౌడ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించగా.. మరో ఇద్దరు నిందితులు పరారయ్యారు. వారిలో మల్దకల్ కల్లుగీత కార్మిక సహకార సంఘం అధ్యక్షుడిగా ఉన్న పెద్దొడ్డి గ్రామానికి చెందిన కేశన్న గౌడ్‌ను గట్టు మండలంలోని మాచర్లలో సోమవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తికి రిమాండ్

ఖిల్లాఘనపురం: చోరీ కేసులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. మండలంలోని వెంకటాంపల్లికి చెందిన బోయ పార్వతమ్మ తన దగ్గర ఉన్న లక్షా నలభై వేలరూపాయలను ఆదివారం తన అన్న నగేష్ ఇంట్లో ఇనుపపెట్టెలో దాచిపెట్టుకుంది. వ్యవసాయ పనుల నిమిత్తం వారంతా పొలాలకు వెళ్లారు. సాయంత్రం వచ్చి చూస్తే డబ్బులు కనిపించలేదు. వెంటనే ఆమె తన కుటుంబసభ్యులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ మొదలు పెట్టిన పోలీసులు అనుమానితునిగా భావించిన అదే గ్రామానికి చెందిన చిలుక చెన్నయ్య సోమవారం అదుపులోకి తీసుకుని కొత్తకోట సీఐ రాంబాబు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. మహిళకు సంబంధించిన డబ్బులు తానే దొంగిలించినట్లు అంగీకరించాడు. తన వద్ద ఉన్న రూ.1.38 లక్షలు పోలీసులకు అప్పగించాడు. డబ్బులను సీజ్ చేసిన అతన్ని వనపర్తి కోర్టులో హాజరుపరిచి రిమాండ్ తలరించారు.

ఇరువర్గాల ఘర్షణ

కేటీదొడ్డి: భూతగాదాలో ఇరువర్గాలు ఘర్షణకు దిగి గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపాలెం చెందిన సాయప్ప, వెంకట్రాములకు ధరూర్ మండలంలోని నీలహళ్లి శివారులో పొలాలు ఉన్నాయి. సోమవారం ఉదయం వెంకట్రాములు పొలంలోకి కాల్వ తీసేందుకు వెళ్లగా సాయప్ప కుటుంబీకులు అడ్డొచ్చారని దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరగడంతో వారికి గాయాలయ్యాయి. ఇందులో తీవ్రంగా గాయపడిన కర్ణ, రాజులను మెరుగైనా చికిత్స కోసం కర్నూల్‌కి తరలించగా సాయప్ప, నరేష్, నాగేంద్ర, నాగరాజు, నవీన్ గద్వాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అబ్దుల్‌షుకూర్ తెలిపారు.


జోరు తగ్గని కృష్ణమ్మ

- జూరాలకు కొనసాగుతున్న వరద ఉధృతి

గద్వాల రూరల్/ ఆత్మకూర్/ రాజోళి: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో జూరాలకు వరద ఉధృతి కొనసాగుతుంది. ఈ క్రమంలో ప్రాజెక్టుకు సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో 3,05,000 క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో ప్రాజెక్టులోని 42 క్రస్టు గేట్లు ఎత్తి 2,76,219, విద్యుదుత్పత్తి ద్వారా 18,755 కలిపి మొత్తం 2,94,974 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి విడుదల చేశారు. అలాగే నెట్టెంపాడు ప్రాజెక్టుకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 1,300, లిఫ్టు-2కు 750, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల సమాంతర కాల్వకు 900, కుడి ప్రధాన కాల్వకు 658, ఎడమ ప్రధాన కాల్వకు 820 క్యూసెక్కులు వదలగా.. మరో 45 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.971 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిలకడగా విద్యుదుత్పత్తి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ జల విద్యుత్ కేంద్రంలోని ఐదు యూనిట్లలోనే సోమవారం ఉత్పత్తి కొనసాగిందని.. 195 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టామని జన్‌కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. జలాశయానికి వరద చేరుతున్న నేపథ్యంలో దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో దిగువ జూరాలలో విద్యుదుత్పత్తి కొనసాగడం లేదన్నారు. ప్రస్తుతం 18,755 క్యూసెక్కుల నీటిని వినియోగించి విద్యుదుత్పత్తి చేపడుతూ దిగువన శ్రీశైలం జలాశయానికి నీటిని వదులుతున్నామని చెప్పారు. 64.313 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని తెలిపారు.



సుంకేసుల డ్యాం వద్ద దిగువకు పారుతున్న వరద నీరు

ప్రమాదకర స్థాయిలో ప్రవాహం..

కృష్ణా: కృష్ణానది తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ ఎండీ నవీద్ హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం నదీతీర ప్రాంతాలైన తంగిడి, కృష్ణా, వాసునగర్ పుష్కర ఘాట్లలో వరద ఉధృతిని పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. మూడు రోజులుగా వరద ఉధృతి క్రమంగా పెరుగుతోందని.. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పహారా కాస్తున్నారని, అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు.



తంగిడిలో వరదను పరిశీలిస్తున్న మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ నవీద్

తుంగభద్రకు 1.51 లక్షల క్యూసెక్కులు

సుంకేసుల డ్యాం వద్ద తుంగభద్ర పరవళ్లు తొక్కుతూనే ఉంది. మూడురోజులుగా వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. డ్యాం అధికారులు సామర్థ్యం మేర నీటిని నిల్వ చేసి మిగిలిన వాటిని దిగువకు వదులుతున్నారు. సోమవారం ఎగువ నుంచి 1,51,700 క్యూసెక్కుల వరద రాగా.. 28 గేట్లు తెరిచి1,48,599 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి, 1,540 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

రూ.36 లక్షల నగదు మాయం కేసు కొలిక్కి

- నిందితులు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారుగా గుర్తింపు
- 12 రోజుల్లోనే ఛేదించిన పోలీసులు

జడ్చర్ల: తెలంగాణ ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి బ్యాగులో దాచి ఉంచిన రూ.36 లక్షల నగదు చోరీ కేసు కొలిక్కి వచ్చింది. జడ్చర్ల పోలీసులు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని 12 రోజుల్లోనే ఛేదించారు. హైదరాబాద్‌లోని బేగంపేటలో నివాసం ఉంటూ.. అక్కడే ట్రాన్స్‌కో ఉద్యోగి దామోదర్ తన ఖాతాలో దాచుకున్న రూ.38 లక్షలను విడతల వారీగా బ్యాంకు నుంచి డ్రా చేశాడు. కర్నూల్‌లో నివాసం ఉంటున్న తన సోదరికి వ్యక్తిగత అవసరం నిమిత్తం ఆ డబ్బును ఇచ్చేందుకు ఈ నెల 16న తన ఇంటి నుంచి హైదరాబాద్ ఎంజీబీఎస్ బస్‌స్టేషన్‌కు వచ్చి అక్కడ కడప వెళ్తున్న బస్సు ఎక్కాడు. తన బ్యాగులో పైవరుసలో బయటకు కనిపించని ఒక పెద్ద కవర్‌లో రూ.36 లక్షలు, మరో చిన్నకవర్‌లో రూ.2 లక్షలు ప్యాక్ చేసి బ్యాగులో పెట్టుకున్నాడు. డబ్బు ఉన్న బ్యాగును తాను కూర్చున్న సీటు పైభాగాన ఉన్న స్టాండ్‌లో పెట్టి జాగ్రత్తగా గమనిస్తూ ప్రయాణించాడు. జడ్చర్ల కొత్తబస్టాండ్‌కు బస్సు చేరుకున్న సమయంలో బస్సు డ్రైవర్ టిఫిన్ చేసేందుకు 10 నిమిషాలు సమయం ఉంటుందని ప్రయాణికులకు చెప్పడంతో బాధితుడు దామోదర్ టిఫిన్ చేసేందుకు సమాయత్తమై స్టాండ్‌లోని తన బ్యాగును చేతిలోకి తీసుకున్నాడు. బ్యాగు బరువు తగ్గి తేడాగా అనిపించడంతో వెంటనే బ్యాగు తెరచి చూడగా.. అందులోని రూ.36 లక్షల కవర్ కనిపించలేదు. వాటి స్థానంలో నాలుగు అరలీటర్ వాటర్ బాటిల్స్ ఉన్నాయి. దీంతో వెంటనే బస్సు డ్రైవర్‌కు సమాచారం ఇచ్చి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు బస్సును తరలించారు. అక్కడ పోలీసులు ప్రయాణికులను, బస్సును తనిఖీ చేశారు. అయితే బ్యాగులో అడుగు భాగాన ఉంచిన మరో చిన్నకవర్‌లోని రూ.2 లక్షల నగదు ఉన్నా.. పైభాగాన ఉన్న రూ.36 లక్షల కవర్ మాయమైంది.

ముమ్మర దర్యాప్తు..

బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన వెంటనే స్థానిక సీఐ ఆదిరెడ్డి ముమ్మరంగా దర్యాప్తును చేపట్టారు. ఆర్టీసీ బస్సులో సీసీ కెమెరాలు ఉండటంతో ఇందుకు సంబంధించి డీవీఆర్ బాక్సును పరిశీలించగా.. డీవీఆర్ బాక్సు ఆఫ్‌లో ఉండటంతో ఎలాంటి సమాచారం దక్కలేదు. దీంతో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద, బస్టాండ్‌లో సీసీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు హైదరాబాద్ ఎంజీబీఎస్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. వాటి ఆధారంగా నిందితులు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారి నుంచి దాదాపు రూ.30 లక్షలు స్వాధీన పర్చుకున్నట్లు తెలిసింది. మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయి దర్యాప్తును ముగించి నిందితులను కోర్టులో హాజరు పరుచనున్నట్లు సమాచారం.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- బంగారు, వెండి నగలు, నగదు అపహరణ

జడ్చర్ల: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి ఇంట్లో దాచి ఉంచిన బంగారు, వెండి నగలతో పాటు కొంత నగదును అపహరించుకెళ్లిన సంఘటన జడ్చర్లలోని అయోధ్యనగర్ కాలనీలో సోమవారం వెలుగు చూసింది. బాధితుడు ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా కొందుర్గుకు చెందిన ప్రవీణ్‌రెడ్డి పోలేపల్లి సెజ్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే తమ గ్రామంలో బోనాల పండుగ ఉండటంతో ఇంటికి తాళం వేసి ఆదివారం సొంత గ్రామానికి వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చి చూడగా.. తాళం విరగ్గొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలో దాచిన 5 తులాల బంగారు, 50 తులాల వెండి నగలతో పాటు రూ.15వేల నగదు కనిపించలేదు. ఈ మేరకు జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలియజేశారు.



చోరీ జరిగిన ఇంటి వద్ద క్లూస్ టీం సభ్యులు

ఇంట్లో రూ. 80 వేల నగదు..

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని శానాయిపల్లిలో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగిందని రేవల్లి ఎస్‌ఐ రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శానాయిపల్లికి చెందిన బదునమ్మ ఆమె భర్త శ్రీశైలం గ్రామంలో నివాసం ఉంటున్నారు. వారి ఇల్లు మెత్తబడి ఒకవైపు కూలిపోవడంతో ఇంటి పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో రాత్రి సమయంలో పడుకుంటున్నారు. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే రాత్రి పక్కింట్లో నిద్రించారు. సోమవారం బదునమ్మ ఇల్లు తెరిచి చూడగా.. అప్పటికే బీరువా తెరుచుకుని లాకర్ పగలగొట్టి కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంట్లో రూ.80 వేల నగదు ఉందని, అవి ఎత్తుకెళ్లిపోయారని బదునమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

ద్విచక్ర వాహనదారుడిపై ఎస్‌ఐ దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఓ ద్విచక్ర వాహనదారుడిపై వనపర్తి జిల్లా పాన్‌గల్ ఎస్‌ఐ దాడికి పాల్పడ్డాడు. ఈఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకోగా.. సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడి వివరాల మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన రంజిత్ బట్టల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి షాపును మూసివేసి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రధాన రహదారిపై యూటర్న్ తీసుకుంటున్న రంజిత్.. ఎదురుగా కారులో సివిల్ డ్రస్‌లో వచ్చిన పాన్‌గల్ ఎస్‌ఐ కల్యాణరావు మధ్య మాటామాట పెరిగి గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో రంజిత్‌ను ఎస్‌ఐ తీవ్రంగా కొట్టడంతో గాయాలయ్యాయి. ఎస్‌ఐ దాడి దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై సీఐ కనకయ్యగౌడ్‌ను వివరణ కోరగా.. ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేశారని, విచారణ చేపట్టినట్లు తెలిపారు.

భారీగా నల్లబెల్లం, పటిక పట్టివేత

- 4,500 కేజీల బెల్లం, 250 కేజీల పటిక స్వాధీనం



ఉప్పునుంతల: మండలంలోని ఉప్పునుంతల- అచ్చంపేట రహదారిలోని దేవదారికుంట స్టేజీ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా నిషేధిత నల్లబెల్లం, పటిక పట్టుబడింది. డీసీఎంలో తరలిస్తున్న 4,500 కేజీల బెల్లం, 250కేజీల పటిక, 5 లీటర్ల సారా, వాహనం స్వాధీనం చేసుకున్నారు. అచ్చంపేటకు చెందిన సతీష్, లింగోటంతండాకు చెందిన కాత్రావత్ ప్రేమ్ చంద్‌ను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలకపల్లి ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. నిందితులు కొంత కాలంగా హైదరాబాద్‌ను నుంచి అచ్చంపేట, తెలకపల్లి ప్రాంతాలకు సారా తయారీలో వినియోగించే బెల్లం, పటికను సరఫరా చేస్తున్నారనే పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు సీఐ తెలిపారు.

కృష్ణా-వికారాబాద్ రైల్వే లైన్‌పై సీఎం పరిశీలన



రైల్వేలైన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, వాకాటి శ్రీహరి, రాంమోహన్‌రెడ్డి

నారాయణపేట: కృష్ణా - వికారాబాద్ రైల్వే లైన్ ఏర్పాటు చేయుటకు సోమవారం హైదరాబాద్ అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో పేట జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైల్వే అధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా - వికారాబాద్ రైల్వేలైన్ రూట్ మ్యాప్‌పై రైల్వేశాఖ చీఫ్ ఇంజినీర్ సుబ్రమణ్యన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఎమ్మెల్యేలతో చర్చించి సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. వికారాబాద్, ఎపరిగి, కొడంగల్, నారాయణపేట, మక్తల్ మీదుగా రూ.3500 కోట్లతో 145 కిలోమీటర్ల రైల్వే లైన్ ఏర్పాటు చేయనున్నారు. సమావేశంలో నారాయణపేట, పరిగి, మక్తల్ ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, రాంమోహన్‌రెడ్డి, వాకాటి శ్రీహరి పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీ పార్కుకు 30 పశువుల తరలింపు



టీచర్స్‌కాలనీలోని చిల్డ్రన్స్ పార్కులో వదిలిన పశువులు ఇవే..

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లపై సంచరిస్తున్న సుమారు 30 పశువులను ఎట్టకేలకు మున్సిపల్ సిబ్బంది పట్టుకుని సోమవారం టీచర్స్ కాలనీలోని చిల్డ్రన్స్ పార్కుకు తరలించారు. వాస్తవానికి కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలో పశువుల సంచారం పెరగడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై 'హైవేపై పశువుల సంచారం' శీర్షికన ఈనెల 11న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు పశువుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. అయినా వారు పట్టించుకోకపోవడంతో వాటిని పట్టుకుని పార్కులో ఉంచారు. కాగా, యజమానులు వెంటనే జరిమానా చెల్లించి, పశువులను తీసుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. లేనిపక్షంలో గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, పశువులను పిల్లలు ఆడుకునే పార్కులో ఉంచడం వల్ల అక్కడికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా వాకింగ్ చేయడానికి, సేదతీరడానికి ఏర్పాటుచేసిన ఈ పార్కులో పశువులను వదిలివేయడం తగదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వాటిని పట్టణానికి దూరంగా వేరే ప్రాంతానికి తరలించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంలో పనిచేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులను అనుమతించడం సిగ్గుచేటని.. మతోన్మాదం పెంచుతూ ప్రజల మధ్య వైషమ్యాలను కేంద్ర ప్రభుత్వం పెంచి పోషిస్తుందని.. ఈ విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఫాసిస్టు సిద్ధాంతాలు కలిగిన మత విద్వేశాలు సృష్టించే ఆర్‌ఎస్‌ఎస్ దాని భావజాలంలో పని చేసేందుకు అనుమతించడం దేశ సమగ్రతను దెబ్బతీయడమేనన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. దేశంలోని రాజ్యాంగ సంస్థలను ఉపయోగించుకొని అక్రమ పద్ధతుల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇండియా కూటమి బలమైన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను లేవనెత్తుతుందన్నారు. ప్రజా సమస్యలపై సీపీఎం పార్టీ కార్యకర్తలు ఉద్యమాలు చేపట్టాలని అన్నారు. సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, రాంరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సర్వేలు నిర్వహించి క్రియాశీలంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. విద్య, వైద్యం రంగాల్లో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు ప్రశ్నించాలన్నారు. సమావేశంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్, పద్మ, రాజ్‌కుమార్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని.. ప్రభుత్వం దళితుల విభజన ప్రయత్నాలు మానుకోవాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర కో-ఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి కోరారు. సోమవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టే సామాజిక చైతన్యదీక్ష కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని అన్ని ప్రాంతీయ భాషల్లో నాన్-డిటైల్డ్‌గా విద్యార్థులకు అందించాలని కోరారు. కరెన్సీ నోట్లపై డా. బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ముద్రించడంతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాగరి, కాటికాపరులకు జాతీయస్థాయిలో తగిన గుర్తింపుతో పాటు కేంద్ర ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. ఉపాధిహామీ పథకాన్ని 150 రోజులకు పెంచి, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నిరకాల సహకారాలు అందించాలన్నారు. రాజ్యాంగ పీఠికను ప్రార్థన సమయంలో తప్పకుండా చదివేలా చూడాలని, ట్రాన్స్‌జెండర్లకు రాజ్యాంగంలో జెండర్ డిక్లరేషన్ చేసి హక్కులు కల్పించాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థల విక్రయాలను నిలిపివేసి, బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయాలన్నారు. దీక్షలకు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌తో పాటు జాతీయ సామాజిక ఉద్యమ నేతలు హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గండీటి చిన్న, జిల్లా అధికార ప్రతినిధి గుడ్ల రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బ్యాగరి సత్తయ్య, యువజన విభాగం అధ్యక్షుడు మహేందర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇద్దరిపై కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: రాయచూర్ ప్రధాన రోడ్డుపై జీపు, ఆటో డ్రైవర్ల మధ్య చిన్నపాటి విషయంపై గొడవ వరకు వెళ్లింది. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ టెక్స్‌టోరియం వద్ద సోమవారం రాయచూర్ వైపు వెళ్లే ప్రధాన రోడ్డుపై జీపు డ్రైవర్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు ఉండగా జీపును అక్కడి నుంచి తీయాలని ఆటో డ్రైవర్ చెప్పాగా ఈ క్రమంలో ఆటో డ్రైవర్, జీపు డ్రైవర్‌కు ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు. ఈ ఘటనలో ఎలాంటి కమ్యూనల్ గొడవలు కానీ, కుల మతాలకు సంబంధించిన గొడవలకు ఆస్కారం లేదని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి దుష్ప్రచారానికి, కమ్యూనల్ గొడవలకు దారి తీసే విధంగా, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.